జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 17-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 617 పేజీలు: 4 వెల: రూ.7






* డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద హెల్త్ సెక్రటరీలు ధర్నా, ముట్టడి
* తమకు న్యాయం చేయాలని నినాదాలు * ఎస్టీ కమిషన్ దృష్టిలో ఉంది
* అక్కడి నుంచి క్లియరెన్స్ వస్తే ప్రాసెస్ ముందుకు
* డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

# మాకు న్యాయం చేయండి





**శ్రీకాకుళం, మార్చి16 (వార్త):** పదోన్నతుల్లో కాలయాపనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెల్త్ సెక్రటరీలు సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయంలో బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణం తమకు న్యాయం చేయాలని కోరారు. పదోన్నతుల విషయంలో జిల్లా అధికారులు తమకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో 605 మంది హెల్త్ సెక్రటరీలు ఉండగా, 154 మందికి రోస్టర్ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాల్సి వుందన్నారు. పదోన్నతుల జాబితా సిద్ధమైనా ఎందుకు విడుదల చేయడం లేదని హెల్త్ సెక్రటరీలు ప్రశ్నించారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేశామన్నారు. అయినప్పటికీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులకు తమకు న్యాయం చేయడం లేదని వాపోయారు. పదోన్నతుల జాబితాను క్లియర్ చేసి తమకు న్యాయం చేసే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకుకుని కూర్చొన్నారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. హెల్త్ సెక్రటరీలను నచ్చజెప్పారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు సైతం ఈ విషయంపై కలెక్టర్‌తో మాట్లాడతామన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత మీడియాతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 154 మంది పదోన్నతులు కల్పించాల్సివుందన్నారు. ప్రస్తుతం ఒరిజినల్ రిక్రూట్‌మెంట్ జాబితా ఏమైందో తెలియడం లేదన్నారు. ఆ రిక్రూట్‌మెంట్ జరిగిన సమయంలో నేను కానీ, ప్రస్తుతం పనిచేస్తున్న ఆఫీసు సిబ్బంది విధుల్లో లేమన్నారు. ఆ జాబితా కోసం అప్పట్లో రిక్రూట్‌మెంట్ ప్రక్రియ చేపట్టిన వారికి డిపార్ట్‌మెంట్ తరపున లేఖను పంపించామన్నారు. ఈ విషయమై కలెక్టర్‌తోపాటు రాష్ట్రస్థాయి అధికారులు కూడా మాట్లాడడం జరిగిందన్నారు. కొందరు హెల్త్ సెక్రటరీలు ఈ అంశం పూర్తిగా ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారని చెప్పారు. అక్కడి నుంచి క్లియరెన్స్ వచ్చిన తర్వాత పదోన్నతుల అంశంపై ముందుకు వెళతామని డీఎంహెచ్‌వో చెప్పారు.

## ఉపాధ్యాయులకు శుభవార్త

* త్వరలో పదోన్నతులు
* వెబ్‌సైట్‌లో తాత్కాలిక సీనియారిటీ జాబితా
* అభ్యంతరాలు ఉంటే ఈనెల 23లోగా తెలియజేయండి
* జిల్లా విద్యాశాఖాధికారి రవి బాబు

**శ్రీకాకుళం మార్చి 16 (వార్త):** ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని అన్ని జిల్లా పరిషత్ ప్రభుత్వ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాసంచాలకులు శుభవార్త చెప్పింది. అర్హత గల ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించనుంది. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేటగిరీల తాత్కాలిక సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ అధికారి వారి వెబ్ సైట్‌లో పొందుపరచిందని డీఈవో ఎ.రవిబాబు తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీకాకుళం వారి వెబ్ సైట్ లింక్ https:// www.sites. google. com/site/deosklorg/లో ఉన్న పదోన్నతుల తాత్కాలిక సీనియారిటీ జాబితాపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా ఈనెల 23వతేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలలోపు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీకాకుళం వారి కార్యాలయం తగిన ధ్రువీకరణ పత్రాలు ఆధారాలతో సమర్పించాలన్నారు. ఉపాధ్యాయులు తన యొక్క టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం డేటాను, సంబంధిత ప్రధాన ఉపాధ్యాయులు, డీడీఓ, ఎంఈవోలు ధృవీకరించిన డిక్లరేషన్ ఫారంలను పిడిఎఫ్ ఫార్మేట్‌లో తమ వద్ద పూర్తి భద్రతతో బాధ్యతతో భద్రపరచాలని డీఈవో సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

## టెన్త్ పరీక్షలు ప్రారంభం

* 105 మంది విద్యార్థులు గైర్హాజరు
* పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, డీఈవో

**శ్రీకాకుళం, మార్చి 16 (వార్త):** జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి రెగ్యులర్, ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు సోమవారం అత్యంత పకడ్బందీగా, ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వయంగా ఒక పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేయగా, జిల్లా పరిశీలకులు 8 కేంద్రాలను, డిఈఓ 4 కేంద్రాలను సందర్శించారు. మొత్తం 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 62 కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయని, ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా 47 సిట్టింగ్ స్క్వాడ్‌ల నిరంతర పర్యవేక్షణలో పరీక్షలు పకడ్బందీగా కొనసాగాయని ఆయన పేర్కొన్నారు.



పదవ తరగతి రెగ్యులర్ తెలుగు, ఒరియా పరీక్షలకు జిల్లావ్యాప్తంగా మొత్తం 28,637 మంది అభ్యర్థులకు గాను 28,532 మంది హాజరయ్యారని, 105 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డిఈఓ తెలిపారు. అదేవిధంగా ఓపెన్ స్కూల్ పరీక్షలకు సంబంధించి 575 మంది అభ్యర్థులకు గాను 492 మంది హాజరు కాగా, 83 మంది అభ్యర్థులు పరీక్షకు రాలేదని వివరించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 145 రెగ్యులర్, 9 ఓపెన్ స్కూల్ పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగరంలోని భాష్యం పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష గదుల్లోకి వెళ్లి విద్యార్థులకు కల్పించిన వసతులను స్వయంగా పర్యవేక్షించారు. పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గదుల్లో తగినంత వెలుతురు, ఫ్యాన్లు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. వేసవి దృష్ట్యా తాగునీటి లభ్యతపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతం, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిఘా ఉంచాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



## పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

**శ్రీకాకుళం, మార్చి16(వార్త):** అమర జీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా సోమవారం పాత బస్టాండ్ వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి, 1952 డిసెంబర్ 15న పొట్టి శ్రీరాములు ప్రాణాలర్పించారన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడైన ఆయన తెలుగువారి ఆత్మగౌరవం కోసం చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. దీని వలన భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పడినట్లు పేర్కొన్నారు. ఆయన త్యాగానికి గుర్తుగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా నడుచుకుందామన్నారు. ఉద్యోగానికి రాజీనామా చేసి గాంధీ బోధించిన సత్యం, అహింస మార్గంలో పయనించినట్లు చెప్పారు. అనంతరం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ తయారు చేసిన ప్రేరణసఖి - 100 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఈఈడబ్యుఐడిసి డెరక్టర్ పిఎంజె బాబు, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు పైడిశెట్టి జయంతి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి అనూరాధ, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, మెప్మా పిడి వెంకటరావు, తహసీల్దార్ గణపతిరావు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనాల చోరీపై.. ప్రత్యేక నిఘా

* వాహనాలను పార్క్ చేసే సమయంలో తాళాలు వేయాలి * బైక్ చోరీలపై ఫిర్యాదు, వివరాలు వాట్సాప్ ద్వారా తెలియజేయండి * జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం క్రైం, మార్చి16(వార్త):** శ్రీకాకుళం జిల్లాలో బైక్ చోరీలపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. వాహన చోరీలపై అందిన ఫిర్యాదులపై తక్షణమే కేసులను నమోదు చేసి, నేరాలకు పాల్పడే నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కేసులను ఛేదించి, రికవరీ చేసిన ద్విచక్ర వాహనాలను బాధితులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. అలాగే తరచూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. వాహన చోరీలకు పాల్పడే నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గత ఏడాదిలో మోటార్ సైకిల్ దొంగతనం సంబంధించిన 103 కేసులు నమోదు అవ్వగా వాటిలో 72 కేసులు, 2026 సంవత్సరంలో ఇప్పటి వరకు 11 కేసులు నమోదు కాగా అందులో 4 కేసులు ఛేదించామన్నారు. ఆయా కేసుల్లో ముద్దాయిలను అరెస్టు చేసి రికవరీ చేసిన బైకులు బాధితులకు తిరిగి అందజేసినట్లు తెలిపారు. కొన్ని సందర్భాల్లో వాహన యజమానులు తమ వాహనాలను ఎక్కడ పార్క్ చేశారో మర్చిపోవడం, లేదా సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల కూడా వాహనాలు కనిపించకపోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిఘా మరింత పెంచినట్లు, పోలీసు పెట్రోలింగ్‌ను కూడా బలోపేతం చేశామన్నారు. వాహన చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ వాహనాలను పార్క్ చేసే సమయంలో తప్పనిసరిగా తాళాలు వేసి జాగ్రత్తలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లయితే బాధితులు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. వాట్సాప్ ద్వారా కూడా సమాచారం అందజేయవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. చోరీకి గురైన ద్విచక్ర వాహనాల పూర్తి వివరాలు, వాహన యజమాని వివరాలు, వాహనం పార్క్ చేసిన ప్రదేశం తదితర సమాచారంపై శ్రీకాకుళం జిల్లా ఎస్పీ 6309990800, అదనపు ఎస్పీ (క్రైమ్) 6309990803, పోలీస్ కంట్రోల్ రూమ్ 6309990933 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపితే తక్షణమే స్పందించి కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల సహకారంతో వాహన చోరీలను పూర్తిగా అరికట్టేందుకు పోలీసు శాఖ కట్టుబడి పనిచేస్తోందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## 30 శాతం ఐఆర్, 12వ పీఆర్‌సీని ప్రకటించండి



**శ్రీకాకుళం, మార్చి 16(వార్త):** మధ్యంతర భృతిని 30 శాతం మంజూరు చేయాలని, 12వ వేతన సవరణ సంఘా న్ని వెంటనే నియమించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బల్లెడ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉగాది కానుకగా ప్రభుత్వ నిర్ణయం కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని వారు పేర్కొన్నారు. రెండేళ్లుగా ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు చాలా ఓపికతో ఉన్నాయన్నారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను ప్రక టించక ముందే ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## సువర్ణపురంలో అక్షరాంధ్ర పరీక్ష



**మందస, మార్చి 16(వార్త):** సువర్ణపురంలో అక్ష రాంధ్ర పరీక్షలు జరిగాయి. గుడ్డిభద్ర, సువర్ణపు రం, ఉగ్రాణిపేట, మకరజోల, అల్లిమెరక తదితర గ్రామాల నుంచి 156మంది పరీక్షలకు హాజర య్యారు. కార్య క్రమంలో సచివాలయ విద్యా సహాయకుడు యువ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ అడ్డి ఈశ్వరరావు, వైస్ సర్పంచ్ అడ్డి ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

## పాకు చెరువుకు సిమెంట్ మెట్లు నిర్మాణం



**కంచిలి, మార్చి 16(వార్త):** ఎమ్మెస్ పల్లి పంచాయతీలో పాకుచెరువు అభివృద్ధికి సర్పంచ్ కొనపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం ఎంతో కృషి చేస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఆ చెరువుకు సిమెంటు మెట్లు నిర్మాణం చేసి ప్రజలకు మరింత సౌకర్యం కల్పించాలని ప్రయత్నించారు. ఎట్టకేలకు వారి ప్రయత్నం ఫలించింది. ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి పంచాయతీ ప్రతినిధుల కోరికను మన్నించి మండల పరిషత్ నిధులను మూడు లక్షల రూపాయలు కేటాయించడంతో పనులు పూర్తిచేశారు. సోమవారం ఎంపీపీ దేవదాసు రెడ్డి ఆ మెట్లను ప్రారంభించారు. ఎంపీ పీకి పంచాయతీ ప్రతినిధులు, ప్రజలు, వైసీపీ కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు లడ్డు కేశవ పాత్ర, తలగాన తిరుపతి, బుడ్డెపు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ మార్పులకు లోబడి వ్యవసాయం చేయాలి




**కంచిలి, మార్చి 16(వార్త):** రాబోవు ఖరీఫ్ సీజన్లో వాతావరణ పరిస్థితులకు లోబడి వ్యవసాయాన్ని రైతులు మార్చుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీ శంకర్రావు, మండల వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ పేర్కొన్నారు. మండలంలో సోమవారం మండపల్లి తలతంపర తదితర గ్రామాల్లో వీరు పర్యటించి రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న సీజన్లో వర్షాభావ పరిస్థితుల దృశ్య స్వల్పకాలిక రకాల వరిని పండించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సేంద్రీయ ఎరువుల వాడకం పెంచాలని, తద్వారా భూసారం, నేలలో తేమ శాతం పెరుగుతుందని అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శిక్షకులు కామరాజు, శివానందం, నాగమణి, కల్పన, వ్యవసాయ సహాయకులు గణపతి పాల్గొన్నారు.

## జనసేన బలోపేతానికి కృషి చేయాలి



**మందస, మార్చి 16(వార్త):** జనసేన బలోపేతానికి జన సైనికులు కృషి చేయాలని ఆ పార్టీ మందస మండల అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు పిలుపునిచ్చారు. మందస పట్టణంలోని మండల తాత్కాలిక పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కమిటీ, క్లస్టర్ ఇన్చార్జిల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆశయ సాధన దిశగా ప్రతీ ఒక్కరూ అడుగులు వేయాలని కోరారు. 12సంవత్సరాలుగా మండల జనసేన పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషి, ఎదుర్కొంటున్న ఒడిదుడుకులు, భవిష్యత్‌లో పార్టీ మరింత బలోపేతానికి కూలంకుషంగా సమావేశంలో చర్చించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లుండ పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ, మండల కమిటీ సభ్యులకు, క్లస్టర్ ఇన్చార్జిలకు గోపాలరావు ధన్యవాదాలు తెలిపారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం




**పలాస, మార్చి 16 (వార్త):** బాల్య వివాహాలు చేసుకుంటే చట్టరీత్యా నేరమని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి తెలిపారు. సోమవారం బ్రాహ్మణతర్ల, కొత్తూరు గ్రామాన్ని సందర్శించి నారీ శక్తి, సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు, సంకల్పం, మైనర్ డ్రైవింగ్ పై అవగాహన సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్, 2006 ప్రకారం అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు తర్వాత మాత్రమే వివాహం, ఇకలవడం నేరం, తల్లిదండ్రులు, సహకారులకు జైలు, జరిమానా విధిస్తారని హెచ్చరించారు.సంకల్పం అంటే పట్టుదల, లక్ష్య సాధనలో అపజయాలను గెలుపుగా మార్చడం, మహిళలు భార్య, తల్లి, ఉద్యోగి పాత్రల్లో సమర్థంగా నిలబడాలని కోరారు. మైనర్ డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులకు రూ.25,000 జరిమానా, 3 సంవత్సరాల జైలు; వాహన ఆర్‌సీ 1 సంవత్సరం రద్దు, మైనర్‌కు 25 ఏళ్ల వరకు లైసెన్స్ ఇవ్వరని హెచ్చరించారు. హైదరాబాద్, ఆంధ్రలో ప్రమాదాలు పెరిగాయని, ప్రమాదాలు నివారణకు కౌన్సెలింగ్ జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కారభారతి విద్యార్థికి నాలుగు బ్యాంకుల్లో కొలువు

**సోంపేట, మార్చి 16(వార్త):** సోంపేటలోని సంస్కారభారతి విద్యాసంస్థల విద్యార్థులు ఎంతోమంది ఎన్నెన్నో ఉద్యోగాలను సాధించిన సంగతి తెలిసిందే. ఇలా ఈ ప్రాంతంలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న సంస్కార భారతి విద్యాసంస్థలు తాజాగా మరో కీర్తిని మూటగట్టుకుంది. ఈ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థి కర్రి ప్రసాదు తాజాగా నాలుగు జాతీయ బ్యాంకులకు సంబంధించిన ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా సంస్థ యాజమాన్యంతో పాటు అధ్యాపకులు కలసి సోమవారం ప్రసాదును దుస్సాలువతో సత్కరించాయి. ప్రసాదు మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని సంస్థ చైర్మన్ వై దేవరాజు ఆకాంక్షించారు. ఇందుకు సహకరించిన ప్రసాద్ కుటుంబ సభ్యులను కూడా యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కవిరాజు, ఏవో పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.



## పట్టువదలని విక్రమార్కుడు..

-పిడిమందస యువకుడి ప్రతిభ -అభినందించిన ప్రజలు

# మూడింట్లో కొలువు దీరాడు



**మందస, మార్చి 16(వార్త):** ఆయనో సరస్వతీపుత్రుడు.. పట్టువదలని విక్ర మార్కుడు.. ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించి, తానంటే ఏమిటో నిరూపించాడు. సామాన్య, పేద కుటుంబంలో జన్మించిన ఆయన స్వయంకృషితో చదవి మరీ లక్ష్యాన్ని నెరవేర్చుకున్నాడు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎంతో మంది ప్రతిభావంతులున్నారు. మట్టిలో మాణిక్యంలా మరో యువకుడు మూడు ఉద్యోగాలు సాధించి, కృషి, పట్టుదల, అంకితభావంతో చదవితే ఉన్నత లక్ష్యాలను కూడా చేధించగలమని నిరూపించాడు. అందరి మన్ననలు పొందాడు. మందస మండలంలోని పిడిమందస గ్రామానికి చెందిన సేనాపతి విక్రంకుమార్ సాధారణ, పేద, రైతు కుటుంబంలో జన్మించారు. ఒకటవ నుంచి పిడిమందస ప్రభుత్వ పాఠశాల, 5 నుంచి 10వ తరగతి వరకు ఇదే మండలంలోని కుంటికోట కె.నారాయణ స్కూల్లో చదివారు. అనంతరం ఇంట ర్మీడియట్, బీటెక్ విజయవాడలో చదివి, ఉద్యోగ వేటలో పడ్డారు. స్వయం కృషి, పట్టుదల, కృషి, అంకితభావంతో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యారు. పట్టువదలని విక్రమార్కునిలా చదివిన ఆయనకు సరస్వతీ కటాక్షం లభ్య మైంది. ఒకటి కాదు, రెండు కాదు.. మూడు ఉద్యోగాలు సాధించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జూనియర్ అసోసియేట్ క్లర్క్(కర్ణాటక), ఐబీపీఎస్ క్లర్, కెనరాబ్యాంక్, కర్ణాటక, తెలంగాణా గ్రామీణ బ్యాంక్ క్లర్క్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఒక ఉద్యోగం రావడమే గగనమవుతున్న తరుణంలో ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికైన విక్రమ్‌ను స్థానికులు అభినందించారు. ఆయన తల్లిదండ్రులు సేనాపతి రాజేశ్వరరావు, దమయంతి దంపతులు కుమారుడు ప్రయోజకుడు కావడంతో ఆనందం వ్యక్తం చేశారు.

## రైతులు రసాయన మందుల వాడకం తగ్గించాలి

-గ్రామాల్లో అన్నదాతలకు అవగాహన




**మందస, మార్చి 16(వార్త):** రైతులు క్రిమిసంహారక మందుల వాడకం తగ్గిస్తే మేలని మందస మండల వ్యవసాయాధికారి జి.నాగరాజు, తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన అన్నారు. మందస మండలం బాలిగాం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మందస మండల వ్యవసాయాధికారి జి.నాగరాజు, తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాగు భూమి ఉన్న రైతు కుటుంబాలు అందరికీ అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ద్వారా మూడు విడతల్లో 20,000రూపాయలు వారి ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. డబ్బులు ఎవరికైన జమ కాకుంటే రైతు సేవా కేంద్రం లో నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో రైతన్నలు మేలు కోసం ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తే వ్యవసాయం లాభసాటిగా అవుతుందని, రైతులు క్రిమి సంహారక మందులు వాడకాన్ని తగ్గించాలన్నారు. ధాన్యం ఇచ్చిన 24గంటల్లోనే డబ్బులు జమ అయ్యాయని, మండలంలో రైతులు అందరికీ ధాన్యం డబ్బులు జమ అయ్యాయన్నారు. దళారీ వ్యవస్థ నిర్మూలనే చంద్రబాబు నాయుడు లక్ష్యం అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పెన్షన్లు 4000, 6000, 10000కు పెంచారని, తల్లికి వందనం, స్త్రీశక్తి పథకాలను అమలు చేశారన్నారు. పలాస శాసనసభ్యులు గౌతు శిరీష ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, రైతులకు సకాలంలో సాగునీటి తోపాటు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించిన ఘనత గౌతు శిరీష దక్కిందని తెలిపారు. పాడి రైతులకు గోకులాలు, పశువుల దాణా పంపిణీ, పశువుల ఆరోగ్య రక్షణకు సకాలంలో టీకాలు పంపిణీ చేయించారని, ఇది మన మంచి ప్రభుత్వం అని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ కె.జ్యోత్స్న, అసిస్టెంట్ వల్లభరావు, లబ్బ రుద్రయ్య, సాలీన మాధవరావు, గున్న రఘుపతి, అవుగాన ఈశ్వరరావు, గున్న శ్రీను, బెందాలం షణ్ముఖ రావు, గున్న విక్రమ్, పొందూరు అశోక్, మాదిన శ్రీకాంత్, మహంతి పాపారావు, గున్న రమణమూర్తి, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## మందసలోనే మినీ స్టేడియం నిర్మించాలి

ఎంఎల్ఏ శిరీషను కోరిన ప్రజలు

**మందస, మార్చి 16(వార్త):** మందస పట్టణంలోనే మినీ స్టేడియం నిర్మించాలని మందస మేజర్ పంచాయతీ, పరిసర గ్రామాల ప్రజలు పలాస నియోజకవర్గం ఎంఎల్ఏ గౌతు శిరీషను కోరారు. మందస వచ్చిన ఆమెకు హై స్కూల్ వద్ద వినతిపత్రం అందజేశారు. మందస, చుట్టుపక్కల గ్రామాలలో యువత పెద్ద సంఖ్యలో ఉన్నారని, క్రీడలపై ఆసక్తి కలిగి ఉన్నారన్నారు. గత కొద్ది కాలంగా మందస పట్టణం, పరిసర గ్రామాల ప్రజలు వివిధ జాతీయ రాష్ట్ర స్థాయిలో మందస పట్టణం నుండి ప్రాతినిధ్యం వహించడం జరిగిందన్నారు. అయితే సరైన క్రీడా మైదానం, సదుపాయాలు లేకపోవడంతో యువతకు క్రీడలను అభ్యసించడానికి తగిన అవకాశాలు లభించడం లేదన్నారు. గ్రామ యువత అభివృద్ధి, క్రీడల ప్రోత్సాహం దృష్ట్యా మందసలో ఒక మినీ స్టేడియం నిర్మించవలసిందిగా కోరుతున్నామన్నారు. మందసలో మినీ స్టేడియం నిర్మాణానికి అవసరమైన స్థలం మందస రెవెన్యూ పరిధిలో అందుబాటులో ఉందని, ఈ విషయం మీ దృష్టికి తీసుకు వస్తున్నామని, సంబంధిత అధికారులతో చర్చించి, తగిన చర్యలు తీసుకొని.. మందసలోనే మినీ స్టేడియం నిర్మాణం చేపట్టాలని కోరారు. మందస మేజర్ పంచాయతీ, పరిసర గ్రామాల యువతకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండి, గ్రామ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సానుకూలంగా పరిశీలించి మందసలో మినీ స్టేడియం నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకోవలసిందిగా వారు కోరారు.

## ఇచ్ఛాపురం సమస్యలు పరిష్కరించండి



**ఇచ్ఛాపురం, మార్చి 16(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి , వైసిపి బిసి విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, ఎస్.సి కార్యదర్శి సల్ల దేవరాజు లతో కలసి శ్రీకాకుళం జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్సు సెల్ లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలపై అభ్యర్థనలు శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్ పర్మాన్ ఆహమ్మద్ ఖాన్ కి అందజేసారు. కవిటి మండలం, వరక పంచాయతీ లో తలసేమియా తో బాధ పడుతున్న కిరణ్ పురియా (8 సంలు) గత సంవత్సర క్రితం సర్టిఫికేట్ సమర్పించినా పెన్షన్ మంజూరు చేయలేదని చెప్పారు. ప్రస్తుతం విశాఖపట్నం కెజిహెచ్ లో వుండడం వల్ల అతి సున్నితమైన ఈ టెస్టింగ్ చేయడం అత్యంత కష్టతరమైనదని, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలలోని సుమారు 65 మంది రోగుల సదుపాయం కోసం శ్రీకాకుళం రిమ్స్ లో గానీ, టెక్కలి జిల్లా ఆసుపత్రి లో గానీ తలసేమియా టెస్టింగ్ సెంటర్ ని ఏర్పాటు చేయాలని కోరారు. ఇచ్ఛాపురం పట్టణం లో కొళిగాం రోడ్డు లో రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ప్రతిపాదించిన రైల్ ఓవర్ బ్రిడ్జిని రీ లొకేట్ చేసి వి.కె పేట రోడ్డు రద్దీని తొలగించుటకు రైల్వే శాఖ తో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపించాలని కోరారు. బాహుదానది ఎడమ వరదగట్టు పలుచోట్ల గండ్లు కొట్టి వుండడం వల్ల వరదల సమయంలో బెల్లుపడ, ఈదుపురం, కేసుపురం, బూర్జపాడు వ్యవసాయ భూములు ముంపు బారిన పడే అవకాశం వున్నందున విజి రాం (జి) నిధులతో వరదగట్టు పటిష్ఠపరుచాలని కోరారు. ఇచ్ఛాపురం మండలం, బూర్జపాడు పంచాయతీ పెద్ద లక్ష్మీపురం గ్రామస్థులు ఒడిషా అధికారులు పోర్టు నిర్మాణం కొరకు సర్వేలు చేస్తున్నందు వల్ల తమ ఇల్లు, భూములు కోల్పోతమనే ఆందోళన చెందుతున్నందు వల్ల వారిని సాంత్వన చేకూర్చే ప్రకటన చేయవలసినదిగా కోరారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ1,2,3 వార్డులు పురుషోత్తపురం, అమీన్ సాహెబ్ పేటలలో దశాబ్ధాలుగా తాగునీటి కొరతతో ఇబ్బంది పడుతున్నారని, పురుషోత్తపురం కొండపై ఓవర్ హెడ్ ట్యాంకు పైకి నీటిని పంపింగ్ ద్వారా పంపించి గ్రావిటీ ద్వారా ఆ రెండు గ్రామాలకు తాగునీరు ఇప్పించాలని కోరారు. బాహుదా నదిలో విచక్షణారహితంగా ఇసుక తోడకం వల్ల నదీ గర్భం 2 మీటర్లు కుంచించుకు పోయి బాహుదానదీ పరీవాహక ప్రాంతంలోని 11 ఓవర్ హెడ్ చానెల్లు క్రింద ఉండే పొలాలకు నీరందక గత 8 సంవత్సరాలుగా పంటలుకు, బ్రీడ్జిలు, త్రాగునీటి ప్రాజెక్టులకు ఆనుకొని అక్రమ ఇసుక తోడకం వల్ల ఆయా నిర్మాణాలకు ప్రమాదం ఏర్పడనున్నందున అక్రమ ఇసుక తోడకాన్ని నిలుపుదల చేయలని కోరారు.ఈదుపురం వద్ద బాహుదా నదిపై వంతెన నిర్మాణం కొరకు 2015 లో మెట్టు భూమిని ఇచ్చిన ఆశి కమలమ్మ (దూపాన చంద్రయ్య కుమార్తె)కు చెందిన య 0.73 సెంట్లు భూమికి నష్టపరిహారం ఇంతవరకు అందలేదని నష్టపరిహారం అందజేయాలని కోరారు.

## మందస మాజీ ఎంపీటీసీ సభ్యుడు రేగి కృపారావు ఆకస్మిక మృతి



**మందస, మార్చి 16(వార్త):** మందస ఎంపీటీసీ సభ్యునిగా పని చేసిన రేగి కృపారావు(61) ఆకస్మికంగా మరణించారు. తెలుగుదేశం పార్టీలో ఆయన మంచి సేవలందించారు. దళిత సంఘాల నాయకునిగా ఆయనకు పేరుంది. ఆదివారం వేకువజామున తీవ్ర అస్వస్థతకు కృపారావు గురయ్యారు. కుమారుడితో తనకు బాగులేదని చెప్పి కుప్పకూలిపోయారు. ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆయన మరణించారు. కృపారావు తండ్రి ఎరకయ్య మందస సర్పంచ్‌గా పని చేశారు. మృతుడికి భార్య ధనలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కృపారావు మృతికి మందస సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, లక్ష్మణ మూర్తి తీవ్ర సంతాపం తెలిపారు. పలువురు కృపారావు అంత్యక్రియాల్లో పాల్గొని, ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## జనసేన పార్టీలో భారీ చేరికలు



**జి.సిగడాం, మార్చి 16(వార్త):** జి.సిగడాం మండలంలో సోమవారం సీనియర్ నాయకులు తిరుమల రెడ్డి గౌరీ శంకరరావు అధ్వర్యంలో జనసేన ఎచ్చెర్ల నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ విశ్వక్సేన్ సమక్షంలో దేవరవలస గ్రామానికి చెందిన పలు కుటుంబాలు భారీగా వైసీపీ నుంచి జనసేనలో చేరాయి. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు పార్టీ కండువాలు వేసుకొని పార్టీలో చేరారు.. గతంలో కూడా జనసేన వైపు పది పంచాయతీల పెద్దలు పార్టీలో చేరారు. గత వైసీపీ ఆర్ సీపీ హయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విసిగిచెందారని నియోజకవర్గ అబివృద్ధి జనసేన కూటమి ప్రభుత్వానితోనే సాధ్యమన్నారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన వైపు అధిక సంఖ్యలో చేరుతున్నారని, జనసేన పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శులు తాళబత్తుల పైడిరాజు, వడ్డాది శ్రీను, జనసేన నాయకులు బత్తుల నాని, మక్క సాయిబాబా నాయుడు డైరెక్టర్ విక్రమ్ సందీప్, రామారావు, శివ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## అలుదులో తాగునీటి సమస్య

- రక్షిత మంచినీటి పథకానికి

మరమ్మతులు చేయాలని గ్రామస్థుల విజ్ఞప్తి



**సారవకోట, మార్చి 16(వార్త):** అలుదు గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం (ఆర్‌డబ్ల్యూఎస్) పాడైపోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయిందని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో చాలా రోజులుగా ఈ సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులకు పలుమార్లు సమాచారం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామస్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతూ దూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య మరింత తీవ్రమవుతుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి రక్షిత మంచినీటి పథకాన్ని మరమ్మతులు చేసి గ్రామానికి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్

**జి.సిగడాం, మార్చి 16(వార్త):** జి.సిగడాం ఆరోగ్య కేంద్రంలో సోమవారం 14 ఏళ్లు దాటిన బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ టీకాలను వైద్యాధికారి డాక్టర్ బుడుమూరు యశ్వంత్ సమక్షంలో వేశారు. ఈ టీకాలతో ఆరోగ్యం మరింత సంరక్షణగా ఉంటుందన్నారు. అర్హులైన వారందరికి పక్కాగా వ్యాక్సిన్ వేస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు బాస్కరరావు, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పవర్ ఆఫ్ ది సీఆర్సీ షార్ట్ రీల్‌కు ద్వితీయ బహుమతి

**పలాస, మార్చి 16 (వార్త):** కన్జ్యూమర్ రైట్స్ కౌన్సిల్, ఏ.పీ. ప్రభుత్వం సంయుక్త నిర్వహణలో వినియోగదారుల హక్కులపై ఉభయ తెలుగు రాష్ట్రాలు (ఆంధ్ర, తెలంగాణ) రాష్ట్రస్థాయి షార్ట్ ఫిలిం, షార్ట్ రీల్ పోటీలు విశాఖపట్నంలో నిర్వహించారు. సనారా వంశీ రచన, దర్శకత్వంలో నిర్మితమైన పవర్ ఆఫ్‌ది సీఆర్సీ (కన్జ్యూమర్ రైట్స్ కౌన్సిల్) షార్ట్ రీల్‌కు ఉభయ రాష్ట్రాల ద్వితీయ బహుమతి లభించింది. సగటు సామాన్యుడు అనారోగ్యం వస్తే కార్పొరేట్ హాస్పిటల్‌కు వెళితే ఆర్థికంగా అడుగడుగునా ఎలా ఇబ్బంది పడతాడు, విచిత్రమైన సంఘటనలను ఎలా చాకచక్యంగా ఎదుర్కొంటాడో, స్పష్టంగా ఈ రీల్ లో దర్శకులు చూపించగలిగారు. విశాఖ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రముఖ సినిమా నటుడు సుమన్, కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ శంకబ్రాతబాక్చి, కన్జ్యూమర్ రైట్స్ కౌన్సిల్ కమిషన్ ఫస్ట్ క్లాస్ జడ్జి తనూజ.. ఈ రీల్‌లో నటించిన ప్రముఖ సినీ నటులు డాక్టర్ కుమార్ నాయక్, బొబ్బది అప్పారావు, అనిల్ గుమ్మలకు బహుమతులను అందించారు. విశాఖ జిల్లా సప్లై ఆఫీసర్ భాస్కరరావు, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ డిపార్ట్మెంట్ రవికుమార్, సీఆర్సీ జాతీయ అధ్యక్షుడు వికాస్ పాండే, జాతీయ ప్రధాన కార్యదర్శి దొడ్డి చంద్రశేఖర్, సినీ రచయిత సత్యాడ నరసింగరావు, జాతీయ స్పోక్స్‌పర్సన్ అవినాష్, బెంజిమన్, జాతీయ స్టాండింగ్ కౌన్సిల్ సుకన్య ప్రియా, జాతీయ ఆర్గనైజర్ సెక్రెటరీ శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



# పలాసలో ప్లాస్టిక్ పరేషాన్!

**-యథేచ్ఛగా..నిషేధిత పాలిథిన్ కవర్ల విక్రయాలు**

**-వ్యాపారులతో కొంతమంది మున్సిపాలిటీ అధికారుల లోపాయికర ఒప్పందం**

**-జీఎస్టీ ఎగవేతపై అధికారుల నిర్లక్ష్యం**

**పలాస, మార్చి 16 (వార్త):** పలాస మున్సిపాలిటీలో నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయని పలువురు విమర్శలు గుప్పేస్తున్నారు. సందట్లో సడేమియా అంటూ కొంతమంది వ్యాపారాలు అధిక ధరలు నిర్ణయిస్తున్నారని, అది ఏమిటి అని ప్రశ్నిస్తే ఇరాన్ ఇజ్రాయిల్ లో జరుగుతున్న దాన్ని యుద్ధాన్ని భూతములా చూపిస్తూ వ్యాపారులు దోచుకుంటున్నారని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ ధరల పెరుగుదలపై సరైన స్పష్టత లేకపోవడంతో సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు లోపాయికారీ ఒప్పందం చేసుకోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. చిన్న చితక వ్యాపారులు కూడా భారీ ధరలకు సరుకులు కొనుగోలు చేయాల్సి వస్తోందని వారంటున్నారు. భారీ స్థాయిలో జరిగే సరఫరా వ్యాపారంపై మాత్రం అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి కలిగే నష్టం గురించి అధికారులు తరచూ హెచ్చరిస్తున్నప్పటికీ, అదే సమయంలో మార్కెట్లలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయాలు కొనసాగడం ప్రజల్లో సందేహాలు రేకెత్తిస్తోంది. ఫలితంగా చివరికి వినియోగదారులపై భారం పడుతోందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంపై స్థానిక అధికారులు మాత్రం. పెద్దగా స్పందించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కెట్లో ధరల నియంత్రణపై పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు స్వేచ్ఛగా ధరలు పెంచుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి ధరల పెరుగుదలపై విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పలాస నియోజకవర్గం పరిధిలో మార్కెట్లు, కిరాణా దుకాణాలు, వీధి వ్యాపారాలలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు ఇప్పటికీ బహిరంగంగా వినియోగంలో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇతర జిల్లాలు, సమీప ఒడిశా రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున ప్లాస్టిక్ కవర్లు పలాస కు చేరుతున్నప్పటికీ వాటిపై సరైన పర్యవేక్షణ లేదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అయితే చర్యల విషయంలో మాత్రం వివాదం నెలకొంది. చిన్నచిన్న టీ స్టాల్, చిన్న వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే వెంటనే ఫైన్లు విధిస్తున్నారని, కానీ పెద్ద పెద్ద వ్యారులకు మాత్రం చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జంట పట్టణాలకు ఇటీవల భారీగా ప్లాస్టిక్ వస్తువులు తరలివస్తున్నాయని పలువురు చెబుతున్నారు. అయితే ఈ సరుకులపై విధించాల్సిన జీఎస్టీ పన్ను విషయంలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. కొంతమంది వ్యాపారులు జీఎస్టీని పక్కదారి పట్టిస్తూ సరుకులను మార్కెట్లోకి తీసుకువస్తున్నారని, స్థానిక వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. జంట పట్టణాలకు పెద్ద ఎత్తున వస్తున్న ఈ ప్లాస్టిక్ సరుకులపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం నష్టపోతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జీఎస్టీ అధికారులు సరైన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇక ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు కూడా ఈ వ్యవహారాన్ని చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జంట పట్టణాలలో ప్లాస్టిక్ వస్తువుల వ్యాపారంపై వినియోగదారులు, కొంతమంది వ్యాపారులు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించి ప్లాస్టిక్ సరుకుల రవాణా, జీఎస్టీ చెల్లింపులపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్రచారం ఒకవైపు జరుగుతుండగా, మరోవైపు అదే ప్లాస్టిక్ వినియోగం కొనసాగుతుండటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





## సివిల్స్ విజేతకు ఘన సత్కారం

**జి.సిగడాం, మార్చి 16(వార్త):** నడిమివలస గ్రామానికి చెందిన సారోతు రాము సివిల్స్ అల్ ఇండియా లో 463 ర్యాంకు సాధించారు. సోమవారం మండల పరిషత్ కార్యలయంలో ఎంపిడిఓ గుంటముక్కల రామకృష్ణారావు, డెప్యూటీ ఎంపిడిఓ మురళీ, డెప్యూటీ తహసీల్దార్ పోన్నాడ నిర్మల, బాతువ సహకర సంఘం చైర్మెన్ నక్క మురళీ, ఎపిఓ చోళ్ల సత్యన్నారాయణ, ఎపిఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, ఈసి గేదెల పురిషోతంనాయుడు, రాజేఖర్ లతోపాటు విఆర్‌ఓలు, పంచాయితీ కార్యదర్శులు కలిసి ఘనంగా సత్కారం చేసారు.

## పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

**-ఎమ్మెల్యే గౌతు శిరీష**



**పలాస, మార్చి 16 (వార్త):** తెలుగు ప్రజల కోసం తన ప్రాణాలను అర్పించిన త్యాగధనుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు అని, ఆయన త్యాగం చిరస్మరణీయమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల పలాస క్యాష్యు అసోసియేషన్ హాల్‌లో జరిగిన పొట్టి శ్రీరాములు 125వ జయంతి నివాళి కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ, "గతం మర్చిపోతే భవిష్యత్తు ఉండదు" అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. పొట్టి శ్రీరాములు వంటి మహనీయులు చేసిన త్యాగాల ఫలితంగానే ఈరోజు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని, వారి చరిత్రను మన పిల్లలకు, భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆమె నొక్కిచెప్పారు.

### అమరావతిలో "స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైస్"

తెలుగు భాష మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల నిరాహారదీక్షకు గుర్తుగా, మన రాజధాని అమరావతిలో 58 అడుగుల "స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైస్" (త్యాగమూర్తి విగ్రహం) ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం గర్వకారణమని శిరీష పేర్కొన్నారు. ఇది ఆయన త్యాగానికి దక్కిన సరైన గౌరవమని కొనియాడారు.

అందరివాడు పొట్టి శ్రీరాములని, పొట్టి శ్రీరాములు ఒక కులానికో, మతానికో, ప్రాంతానికో చెందిన నాయకుడు కాదని, ఆయన యావత్ తెలుగు జాతి కోసం, సామాన్యుల హక్కుల కోసం పోరాడారని గుర్తుచేశారు. ముఖ్యంగా, దళితుల హక్కుల కోసం, వారికి సమాన అవకాశాలు కల్పించడం కోసం ఆయన చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులను కుల, మతాలకు అంటగడుతున్న నేటి రాజకీయ పరిస్థితులు బాధాకరమని, శ్రీరాములు వంటి నిస్వార్థ నాయకులే మనకు ఆదర్శమని అన్నారు. తెలుగు జాతి ఉన్నంత వరకు పొట్టి శ్రీరాములు పేరు నిలిచి ఉంటుందని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలాస క్యాజు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మల్ల శ్రీనివాసరావు, మల్ల సంతోష్, సిసిఎంఏ బృందం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జూద శిబిరంపై పోలీసుల దాడి

**సారవకోట, మార్చి 16(వార్త):** సారవకోటలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో జూదం ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామ పరిధిలో జూదం జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ అనీల్ కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేపట్టారు. ఈ సందర్భంగా జూదం ఆడుతున్న వారిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.78 వేల నగదు, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ అనీల్ కుమార్ తెలిపారు. మండలంలో ఎవరైనా జూదం వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



## గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలకు శ్రీకారం




**పోలాకి, మార్చి 16(వార్త):** పశువుల్లో వ్యాపించే గాలికుంటు వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం చేపట్టిన గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నరసన్నపేట నియోజకవర్గంలోని పోలాకి మండలం మబుగాం గ్రామంలో సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణలో టీకాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గాలికుంటు వంటి అంటువ్యాధులు వ్యాపించకుండా నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ టీకాల కార్యక్రమం మార్చి 16 నుంచి ఏప్రిల్ 14 వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కాలంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పశువులకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలుమూరు మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, పిఎసిఎస్ చైర్మన్ దుంగ స్వామిబాబు, పర్లాం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కింజరాపు సత్యనారాయణ, రేగాన సత్యనారాయణ, చల్లవానిపేట సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు, డాక్టర్ బి.పద్మప్రియ, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## గోవిందపురంలో 16 మందికి హెచ్‌పీవీ వ్యాక్సిన్



**వజ్రపుకొత్తూరు/సంతబొమ్మాళి, మార్చి 16(వార్త):** వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ వాహిని ప్రియాంక, డాక్టర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో 14 ఏళ్ల 16 మంది బాలికలకు సోమవారం హెచ్ పివి వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వాహిని ప్రియాంక మాట్లాడుతూ స్త్రీలలో గర్భాశయ క్యాన్సర్‌కి కారణమైన హెచ్‌పీవీ నివారణకు వ్యాక్సినేషన్ ప్రక్రియ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోందని తెలిపారు . హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ) కారణంగా మహిళల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ వస్తుందని, దీన్ని నివారించడానికి 14 ఏళ్లు నిండి 15 ఏళ్లలోపు బాలికలకు ఉచితంగా ఒక్క డోస్ టీకా అందిస్తున్నామన్నారు . టీకా వేసుకోవడం వలన హెచ్‌పీవీ వైరస్ కారణంగా స్త్రీలలో వచ్చే ప్రాణాంతక గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుకోవచ్చని వివరించారు. ఇది స్వచ్ఛంద వ్యాక్సినేషన్ కార్యక్రమం కాబట్టి తల్లితండ్రులు అంగీకారంతో బాలికలకు టీకా ఇస్తామన్నారు. వ్యాధి సోకిన తర్వాత చికిత్స కోసం ఇబ్బంది పడడం కంటే ముందుగానే నివారించుకోవడం ఉత్తమమన్నారు. ఈ వ్యాక్సిన్ వేయించడం ద్వారా గర్భాశయ క్యాన్సర్ నుంచి దాదాపు 98శాతం మేరకు రక్షణ కల్పిస్తుందని ఆమె సూచించారు. బాలికల ఆరోగ్య భవిష్యత్తు కోసం ఈ కార్యక్రమాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఎవరికైనా హెచ్ పివి వ్యాక్సిన్ పై సమాచారం కావాలనుకుంటే గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులను, సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ రేజేటి సుబ్రహ్మణ్యం, స్థానిక నాయకులు ఈశ్వర రావు, రమణ, గోపి, పాపారావు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఆర్ఎమ్‌కే వారోత్సవాలపై అవగాహన

**ఇచ్ఛాపురం, మార్చి 16(వార్త):** ఇచ్ఛాపురం మండలంలోని మండపల్లి రైతు సేవా కేంద్రం వద్ద ఆర్ఎమ్‌కే వారోత్సవాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ పాల్గొని రైతులకు వివిధ వ్యవసాయ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.రైతు సేవా కేంద్రం స్థాయిలో నిర్వహించిన ఆర్ఎమ్‌కే ప్రచార కార్యక్రమంలో రైతుల నుండి సూచనలు, సమస్యలు మరియు అభిప్రాయాలు సేకరించి వాటిని తదుపరి విశ్లేషణ కోసం నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన అన్ని వివరాలను ఎం ఐ ఎస్ వ్యవస్థలో నమోదు చేసి, అవసరమైన ఫోటోలు డేటాను అప్లోడ్ చేయాలని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితులు వ్యవసాయంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులకు అవగాహన కల్పిస్తూ, ముఖ్యంగా మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో జరుగుతున్న సంఘర్షణ కారణంగా డీజిల్ ధరలు, రవాణా ఖర్చులు మరియు ఎరువుల దిగుమతులపై ప్రభావం ఉండవచ్చని వివరించారు. ఇంధన ధరలు పెరగడం వల్ల సాగు ఖర్చులు కూడా పెరగవచ్చని తెలిపారు. అలాగే కొన్ని పంటల ఎగుమతులు మరియు మార్కెట్ ధరలు మారే అవకాశంపై రైతులను అప్రమత్తం చేశారు. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం అస్థిరత, నీటి కొరత మరియు అధిక ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉన్నందున పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికలో మార్పులు చేయాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందు పొడి నేలలో విత్తనాలు వేసే పద్ధతి గురించి వివరించి, నీటి కొరత పరిస్థితుల్లో సమర్థవంతమైన నీటి వినియోగం, పంటల వైవిధ్యం పాటించడం, పురుగులు , వ్యాధుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులకు తెలియజేశారు. అవసరమైతే సేంద్రీయ సహజ వ్యవసాయం పద్ధతులపై కూడా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల నమోదు (ఈ-పంట), రైతు నమోదు, పంటల బీమా, ఎరువుల సమర్థ వినియోగం, సహజ వ్యవసాయం, పంట సంరక్షణ చర్యలు, కీటక నివారణ పద్ధతులు వంటి అంశాలపై వివరంగా తెలియజేశారు. అలాగే ప్రభుత్వ వ్యవసాయ పథకాల ప్రయోజనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రబీ సీజన్‌లో సాగు చేస్తున్న ప్రధాన పంటలు అయిన వరి, మినుములు, పెసలు, నువ్వులు తదితర పంటలలో కీటకాలు మరియు వ్యాధుల నివారణకు అనుసరించాల్సిన పద్ధతుల గురించి కూడా రైతులకు అవగాహన కల్పించారు. పంటల నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని, రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు అవగాహన పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ సహాయకులు, రైతులు మరియు ఇతర వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## శత శాతం అక్షరాస్యతే ప్రభుత్వ లక్ష్యం



**మందస, మార్చి 16(వార్త):** సమాజం అక్షరంతోనే అభివృద్ధి జరుగుతుందని వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ మందస అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. ఉల్లాస్ అక్షరాంధ్ర ఫండమెంటల్ లిటరసీ న్యూమరికల్ ఎబిలిటీ టెస్ట్ పరీక్షా కేంద్రాలను ఉపాధి హామీ పథకం ఏపీఓ బీవీ హరిక్రిష్ణతో కలసి పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శతశాతం అక్షరాస్యతే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. మహిళా సంఘాల ఆర్థిక నిర్వహణ, ప్రభుత్వం వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ప్రెనర్ కాన్సెప్ట్ అమలు చేయడం కోసం ప్రతీ ఒక్కరూ ఖచ్చితంగా అక్షరాస్యులు కావలసిన అవశ్యకతను వివరించారు. మందస మండలంలోని అంబుగాం పంచాయతీలో పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో వెలుగు వీఓఏ మహాలక్ష్మితో పాటు గ్రామ సంఘం ప్రతినిధులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐసీడీఎస్ కార్యకర్తలు, ఉల్లాస్ అక్షరాంధ్ర వాలంటీర్లు, లెర్నర్స్ పాల్గొన్నారు.

## తెప్పల అజయ్‌కుమార్‌కు పలువురి పరామర్శ



**మందస, మార్చి 16(వార్త):** తెప్పల అజయ్‌కుమార్‌ను పలువురు పరామర్శించారు. జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ తల్లి తెప్పల ఆదిలక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మరణించారు. అజయ్‌కుమార్ తల్లి కమ్యూనిస్ట్ నాయకుడు తెప్పల కృష్ణమూర్తి సతీమణి. ఆ కుటుంబం ప్రజా ఉద్యమంలోనే కొనసాగుతున్నదని, ఆదిలక్ష్మి మరణం ప్రజా పోరాటాలకు తీరని లోటని వారు అన్నారు. ఆమె మృతికి ప్రగాఢ సంతాపం తెలుపుతూ, ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసుదేవరావు, కార్యదర్శి జోగి అప్పారావు, మీడియా ప్రతినిధి బత్తిని లక్ష్మణ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి ఉన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు




**ఇచ్ఛాపురం, మార్చి 16(వార్త):** శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లోఅమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.పొట్టి శ్రీరాములు చిత్రపటానికి స్కూల్ చైర్మన్ డి కృష్ణమూర్తి రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోస్కూల్ మేనేజర్ కె.సి. పూరి ఉపాధ్యాయులు సురేఖ, శంకర్, రాజ్యలక్ష్మి,రవికుమార్, యశోద, జయలక్ష్మి, మీనా, స్నేహ,పార్వతి, సరోజినీ, ప్రియదర్శిని ఇంటరాక్ట్ క్లబ్ సెక్రటరీ డి. హర్షవర్ధన్ రెడ్డి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ దక్కత కామేష్ నివాళులు అర్పించారు ఈకార్యక్రమంలో మండలంతెలుగు దేశం పార్టీ అధ్యక్షులు లోపింటి పద్మనాభం. సీనియర్ తెలుగు దేశం పార్టీ నాయకులు దక్కత శ్రీనువాస్, సీనియర్ తెలుగు దేశం పార్టీ నాయకులు బదకల. గణపతి డీప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాస్ సీనియర్ అసిస్టెంట్, మౌళి, బినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్‌సీడీ విభాగం



**ఇచ్ఛాపురం, మార్చి 16(వార్త):** ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి సేవలలో ఎన్సీడీ విభాగం అమలు చేశారు. ఈ ప్రోగ్రాంలో క్యాన్సర్ కార్డియావేస్కులరీ ప్రాబ్లమ్స్, డయాబెటిక్ హైపర్ టెన్షన్ తదితర దీర్ఘకాలిక వ్యాధులు స్క్రీనింగ్, పర్యవేక్షణ నిమిత్తం ప్రభుత్వం డాక్టర్ శ్వేతవాణి పండాని ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో నియమించారు. ఇచ్ఛాపురం సమీప ప్రాంతీయ గ్రామస్తులు ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ టి.దేవేందర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయం తెలిసి హాస్పిటల్ అన్ని విభాగాల సిబ్బంది, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## మరమ్మతులతో విద్యుత్ సరఫరా నిలిపివేత

**- పలు గ్రామాల్లో రెండు గంటల పాటు అంతరాయం**

**నరసన్నపేట, మార్చి 16(వార్త):** నరసన్నపేట మండలంలోని దేవాది విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల పనుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామ్ చరణ్ గుప్తా తెలిపారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వెల్లడించారు. నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ కారణంగా గోపాలపెంట, పోతయ్య వలస, మడపాం, బుచ్చిపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరమ్మత్తుల పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.



## హెచ్‌జే దొర సేవలు అమోఘం

**పలాస, మార్చి 16 (వార్త):** ఆంధ్ర, తెలంగాణ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల శ్రీ సత్యసాయి స్టేట్ ట్రస్ట్ కన్వీనర్ గా అత్యుత్తమ సేవలందిస్తూ శ్రీ సత్యసాయి విద్యావిహార్ రామక్రిష్ణపురము నకు దిశానిర్దేశం చేస్తూ, స్కూల్ సమగ్రాభివృద్ధికి ఎనలేని అమూల్యమైన సేవలందించిన హెచ్ జె దొర సేవలు అమోఘమని ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశం అన్నారు.

సోమవారం స్కూల్ ప్రాంగణంలో విద్యార్థిని విద్యార్థుల సమక్షంలో వినమ్ర శ్రద్ధాంజలి ఘటించి, అతని ఉన్నత వ్యక్తిత్వన్నీ గుర్తు చేసుకున్నారు. స్కూల్ కి అతను చేసిన విశిష్ట సేవలను గుర్తు చేసుకొంటూ విద్యపైన విద్యార్థులపైన అతనికి గల మక్కువను మరియొకసారి తలుచుకొని అతని ఆత్మకు సద్గతులు చేకూరాలని ప్రార్థించారు. అతని కుటుంబ సభ్యులందరికి ప్రగాఢ సానుభూతిని శ్రీ సత్యసాయి విద్యావిహార్ రామక్రిష్ణపురము తరుపున తెలియజేసుకుంటు న్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉప అధ్యక్షులు తాలసు శ్రీనివాస్, ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగి శ్రీ లింగరాజు మాస్టర్, శ్రీ సత్యసాయి సేవాసమితి పలాస, కాశీబుగ్గ కన్వీనర్లు ఇప్పిలి తిరుమలరావు, ఎస్. నాగరాజు, ఉపాధ్యాయులు ఉపాధ్యేతర సిబ్బంది పాల్గొన్నారు.



## డ్రోన్ సాయంతో జిల్లేడు ద్రావణం పిచికారీ



**నరసన్నపేట, మార్చి 16(వార్త):** దేవాదిలో మొక్కజొన్న, వరి పంటల్లో తెగుళ్ల నివారించేందుకు జిల్లేడు ద్రావణం పిచికారి కార్యక్రమం చేపట్టారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ తోట రమణ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు తెగుళ్ల రాకుండా నివారించడంలో జిల్లేడు ద్రావణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామంలో సుమారు 1,500 ఎకరాల్లో డ్రోన్ సాయంతో ఈ ద్రావణాన్ని పిచికారి చేసినట్లు వివరించారు. డ్రోన్ సాంకేతికత ద్వారా తక్కువ సమయంలోనే పెద్ద విస్తీర్ణంలో పిచికారి చేయడం సాధ్యమవుతుందని, అలాగే కూలీల అవసరం లేకుండా ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. రైతులు ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకుని పంటలను తెగుళ్ల నుంచి రక్షించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## లింగాలవలస పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

### -విద్యార్థులకు డిక్టేషన్, రైటింగ్ తప్పనిసరి చేయాలని సూచన



**జలుమూరు, మార్చి 16(వార్త):** లింగాలవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ--1 బమ్మిడి మాధవరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పనితీరును పరిశీలించి విద్యార్థుల అభ్యాస స్థాయిపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతిరోజు విద్యార్థులకు డిక్టేషన్ మరియు రైటింగ్ తప్పనిసరిగా ఇవ్వాలని ప్రధానోపాధ్యాయురాలు గుండ ఈశ్వరమ్మకు సూచించారు. అనంతరం ఆయన స్వయంగా విద్యార్థులకు డిక్టేషన్ ఇచ్చి వారి రాతను పరిశీలించారు. ఈ విధమైన అభ్యాస పద్ధతులు విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తిని పెంచుతాయని ఆయన తెలిపారు. విద్యార్థుల హోంవర్క్ పుస్తకాలను కూడా పరిశీలించి ఉపాధ్యాయులకు తగిన సూచనలు ఇచ్చారు. పాఠశాలలో విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలను మెరుగుపరచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

## విద్యార్థులు జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



**నరసన్నపేట, మార్చి 16(వార్త):** ప్రతి ఒక్క విద్యార్థి తమ జీవిత లక్ష్యాన్ని ప్రాథమిక స్థాయిలోనే నిర్దేశించుకోవాలని జిల్లా సర్వ శిక్ష అభియాన్ కెరియర్ గైడెన్స్ ప్రతినిధి శ్రీధర్ సూచించారు. సోమవారం నరసన్నపేటలోని పెద్దపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే తమకు ఏ వృత్తి పట్ల ఆసక్తి ఉందో గుర్తించుకోవడం చాలా ముఖ్యమన్నారు. తమ ఆసక్తులు, ప్రతిభను బట్టి సరైన విద్యను ఎంచుకుంటే భవిష్యత్తులో మంచి అవకాశాలు సాధించవచ్చని తెలిపారు. చిన్నప్పటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదివితే జీవితంలో విజయాన్ని సాధించగలరని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అసిరితల్లి సిరిమానోత్సవానికి శ్రీకారం

**జలుమూరు, మార్చి 16(వార్త):** అంధవరం గ్రామంలో అసిరితల్లి సిరిమానోత్సవానికి ఆదివారం రాత్రి ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు సంప్రదాయ పద్ధతిలో ఉజ్జడి బండిని తయారుచేసి గ్రామదేవత ఉత్సవమూర్తులను ఊరేగించారు. గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాల ప్రారంభాన్ని సూచించారు. ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్న సిరిమానోత్సవానికి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ తవిటినాయుడు తెలిపారు. సిరిమానోత్సవానికి ముందు తొమ్మిది రోజులపాటు ఘటాలతో గ్రామోత్సవాలను నిర్వహిస్తామని ఆయన వివరించారు. గ్రామస్థులంతా కలిసి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించి గ్రామదేవత ఆశీర్వాదం పొందుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



# అన్నదాతకు అండగా రైతన్న మీ కోసం

### -ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస, మార్చి 16 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "రైతన్న మీ కోసం" కార్యక్రమం ద్వారా వ్యవసాయాన్ని పండుగలా మార్చి, ప్రతి రైతు కుటుంబానికి అండగా నిలవడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సోమవారం ఆమె వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి గ్రామంలో జరిగిన "రైతన్న మీ కోసం" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమం కోసం 'పంచసూత్రాల' ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా, మా ప్రభుత్వం ప్రతి రైతు గడప వద్దకు వచ్చి వారి సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వ పథకాలను వారికి వివరించి, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పిస్తోంది," అని తెలిపారు.

### ప్రభుత్వ పథకాలు, లక్ష్యాలు ..

ఆమె మాట్లాడుతూ "ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల కోసం మా ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమైన అంశాలు చెబుతూ జల భద్రత: ప్రతి పొలానికి నీరు అందించడమే లక్ష్యంగా, డ్రిప్, స్ప్రింక్లర్ వంటి ఆధునిక సాగునీటి పద్ధతులను ప్రోత్సహిస్తున్నాము. ఎస్సీ/ఎస్టీ రైతులకు 100% సబ్సిడీతో వీటిని అందిస్తున్నాము. సాంకేతిక పరిజ్ఞానం: వాతావరణ సమాచారం, పంటల ధరలు, పురుగుమందుల వాడకం వంటి వివరాలను రైతులు తమ ఫోన్‌లలోనే తెలుసుకునేలా యాప్‌లను అందుబాటులోకి తెచ్చాము. వ్యవసాయంలో డ్రోన్లు, ఆధునిక యంత్రాల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాము. మనం పండించిన పంటను నేరుగా అమ్మితే ఒక ధర వస్తుంది, అదే దానిని శుద్ధి చేసి, ప్యాక్ చేసి అమ్మితే ఇంకా ఎక్కువ ధర వస్తుంది. ఉదాహరణకు, టమాటాలను పండించి అమ్మడం కన్నా, వాటిని సాస్‌గా, పచ్చడిగా మార్చి అమ్మితే రెట్టింపు లాభం ఉంటుంది. దీనికోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి, చిన్న తరహా పరిశ్రమలు పెట్టుకోవడానికి ప్రభుత్వం మీకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని, అన్నదాత సుఖీభవ, 'పీఎం-కిసాన్' వంటి పథకాల ద్వారా రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. పంటల బీమా, గిట్టుబాటు ధర కల్పించడం, సేంద్రియ ఉత్పత్తుల కోసం రైతు బజార్లను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతుల ఆదాయాన్ని పెంచి, ఖర్చులను తగ్గించి, వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం," అని ఆమె వివరించారు.



ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక నాయకులు,, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



**నరసన్నపేట, మార్చి 16(వార్త):** అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా నరసన్నపేట పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణ దాస్ మరియు యువ నాయకుడు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణ దాస్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన చేపట్టిన నిరాహార దీక్ష, త్యాగం తెలుగు జాతి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆయన త్యాగం వల్లే నేడు ఆంధ్రులు గర్వంగా తలెత్తుకుని నిలబడగలుగుతున్నారని తెలిపారు. గతాన్ని మరచిపోతే భవిష్యత్తు ఉండదని, పొట్టి శ్రీరాములు వంటి మహనుభావుల త్యాగాలను ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువ నాయకుడు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆయన దీర్ఘకాలం నిరాహార దీక్ష చేసి చివరకు తన ప్రాణాలను అర్పించడం తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. ఆయన త్యాగం వల్లే తెలుగువారి గౌరవం దేశవ్యాప్తంగా నిలిచిందని కొనియాడారు.

కార్యక్రమంలో ఎంపీపీలు వాన గోపి, ముద్దాడ బైరాగి నాయుడు, రాష్ట్ర పొందర కూరకుల విభాగం అధ్యక్షులు రాజపు అప్పన్న, జిల్లా కార్యదర్శి మెజ్జాడ శ్యామలరావు, మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, రాష్ట్ర రైతు కార్యదర్శి కనపల శేఖర్ రావు, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి బంకుపల్లి శర్మ, వైస్ ఎంపీపీ పాగోటి రాజారావు, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సతివాడ రామినాయుడు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కల్లేపల్లి లక్ష్మణరావు, మండల బూత్ కమిటీ అధ్యక్షులు బబ్బోది ఈశ్వరరావు, మండల ఆర్టీఐ విభాగం అధ్యక్షులు దుల్ల రమణ, మండల యువజన అధ్యక్షులు బుద్దల రాజశేఖర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగవంసపు దేవిడ్, పొట్నూరు పృధ్వీరాజ్, కోటిపల్లి శ్రీనివాస్, తోట భార్గవ్, కనపల అరవింద్, చిట్టి రవి, బాన్న శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే బగ్గు



**నరసన్నపేట, మార్చి 16(వార్త):** పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం నరసన్నపేట పట్టణంలోని ఆర్ ౘ బి గెస్ట్ హౌస్‌లో ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ =వశ్రీఅవట ఖీబఅం) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా నరసన్నపేట పట్టణంలోని జగన్నాధపురం వీధికి చెందిన పొన్నాడ రమణమూర్తి అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో వైద్య చికిత్స ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.74,826 మంజూరైన చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అలాగే అదే ప్రాంతానికి చెందిన తాళాసు చంద్ర నాగభూషణ గుప్తా కంటి శస్త్రచికిత్స కోసం వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.24,746 మంజూరైన చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మానవత్వంతో ప్రజలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది పేదలకు అత్యవసర వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ నిధి గొప్ప సహాయంగా నిలుస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, నరసన్నపేట, పర్లాం వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్లు శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు సత్యనారాయణ, మాజీ జిల్లా పార్టీ అధికార ప్రతినిధి గొద్దు చిట్టిబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బెవర రాము, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కింజరాపు రామారావు, పీస కృష్ణ, సరిపల్లి మధు, కేలం చిరంజీవి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు రావాడ గణపతిరావు, జిల్లా తెలుగు నాడు ఫెడరేషన్ అధ్యక్షులు బలగ ప్రహర్ష, దొడ్ల మల్లేశ్వరరావు, తాతపూడి వెంకటరమణ, అల్లాడ వెంకటరమణ, అలాగే కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం తెలుగు జాతికి ప్రేరణ



**నరసన్నపేట, మార్చి 16(వార్త):** అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా నరసన్నపేట పట్టణంలోని ఆర్ ౘ బి గెస్ట్ హౌస్‌లో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మరియు నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన పాల్గొని అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ తెలుగు ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన పొట్టి శ్రీరాములు త్యాగం భారత చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన నిరాహార దీక్ష, సంకల్పబలం తెలుగు జాతి చరిత్రలో అజరామరంగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. 1952లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు డిమాండ్ చేస్తూ ఆయన 58 రోజులపాటు నిరాహార దీక్ష చేపట్టి చివరకు తన ప్రాణాలను అర్పించిన త్యాగం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని తెలిపారు. ఆయన త్యాగం ఫలితంగానే 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడేందుకు మార్గం సుగమమైందని గుర్తు చేశారు. భాషా ఆధారంగా రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు కూడా ఆయన త్యాగం ముఖ్య కారణమైందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే అమరావతిలో 58 అడుగుల ఎత్తైన పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం చారిత్రాత్మక ఘట్టం అని తెలిపారు. ఈ విగ్రహం తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచి తరతరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం సాధ్యమైందని అన్నారు. తెలుగు జాతి చరిత్రలో ఆయన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, నరసన్నపేట, పర్లాం వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు సత్యనారాయణ, మాజీ జిల్లా పార్టీ అధికార ప్రతినిధి గొద్దు చిట్టిబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బెవర రాము, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కింజరాపు రామారావు, పీస కృష్ణ, సరిపల్లి మధు, కేలం చిరంజీవి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు రావాడ గణపతిరావు, జిల్లా తెలుగు నాడు ఫెడరేషన్ అధ్యక్షులు బలగ ప్రహర్ష, బతకల గోపి తదితరులు పాల్గొన్నారు. అలాగే తహశీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, హాజరయ్యారు.

## జలుమూరులో ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి తొలి పరీక్ష

### - 6 కేంద్రాల్లో 782 మంది విద్యార్థులు హాజరు

### - మాస్ కాపీయింగ్ ఘటనలు లేవు

**జలుమూరు, మార్చి 16(వార్త):** జలుమూరు మండలంలో సోమవారం నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల తొలి రోజు ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పరీక్షలు సజావుగా జరిగాయి. మండల విద్యాశాఖ అధికారులు ఎంఈఓ--1 బమ్మిడి మాధవరావు మరియు ఎంఈఓ--2 ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం జలుమూరు మండలంలో మొత్తం ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో కలిపి మొత్తం 783 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 782 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఒక విద్యార్థి మాత్రమే పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించబడినట్లు ఎంఈఓలు పేర్కొన్నారు. ఎక్కడా మాస్ కాపీయింగ్ లేదా క్రమశిక్షణా రాహిత్య ఘటనలు నమోదు కాలేదని వారు స్పష్టం చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, వైద్య సహాయం వంటి ఏర్పాట్లు కూడా అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఉపాధ్యాయులు, పర్యవేక్షకులు తమ విధులను క్రమబద్ధంగా నిర్వర్తించడంతో పరీక్షలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముగిసినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జరిగే మిగతా పరీక్షలు కూడా ఇదే విధంగా సజావుగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## పదో తరగతి పరీక్షలకు ఉత్సాహంగా హాజరైన విద్యార్థులు

### -నరసన్నపేటలో ఆరు కేంద్రాల్లో 1,268 మంది హాజరు



**నరసన్నపేట, మార్చి 16(వార్త):** నరసన్నపేట మండలంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. పరీక్షలు ప్రారంభానికి ముందుగానే విద్యార్థులు ఉదయం 8:30 గంటలకే ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా పరీక్షా కేంద్రాల వద్దకు వచ్చి పిల్లలకు ధైర్యం చెబుతూ "ఆల్ ది బెస్ట్" అంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఇది విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంచినట్లు కనిపించింది. మొదటి పబ్లిక్ పరీక్ష కావడంతో విద్యార్థులు కొంత ఆందోళనతో పాటు ఉత్సాహంగా పరీక్షలకు హాజరయ్యారు. మండలంలో ఏర్పాటు చేసిన ఆరు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,268 మంది విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగాయని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి తాగునీరు, భద్రత వంటి సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు సజావుగా కొనసాగినట్లు అధికారులు తెలిపారు.

## దివ్యాంగుల ఉపాధి అవకాశాలు కల్పించాలి

### -పలాస తహశీల్దార్ కార్యాలయం ఎదుట దివ్యాంగుల ధర్నా

పలాస, మార్చి 16 (వార్త):దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడుపలాసలో దివ్యాంగులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనకు దిగారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆవాల వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం పలాస తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు ఆవాల వేణుగోపాల్ మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు మంజూరు చేసి నెలకు 30 కేజీల బియ్యం ఇవ్వాలని కోరారు. వ్యాపారాలు చేస్తున్న దివ్యాంగులకు రూ.5 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తికి అందజేశారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546